క్లుప్తంగా

ప్రారంభమైన చింతకోటమ్మ తిరునాల



గ్రామ దేవత చింతకోటమ్మ

సుండుపల్లె (వీరబల్లి) : మండల పరిధిలోని చిన్న గొల్లపల్లె గ్రామ పంచాయతీ, పూజారి వాండ్లపల్లె వద్ద వెలసిన ప్రాచీన గ్రామ దేవత చింతకోటమ్మ తిరునాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరునాల ఉత్సవాలలో భాగంగా గత 10 రోజులుగా గ్రామ పంచాయతీలోని పలు గ్రామాలలో భక్తుల దర్శనార్థం పల్లకీలో అమ్మవారిని ఊరేగించి ఆదివారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొంగుబ్బాలు పెట్టడం, పుట్ట పూజించుట, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం పుట్ట బంగారు తెచ్చుట, పొంగుబ్బాలు పెట్టుట, తొగట వీర క్షత్రియుల విన్యాసాలు, కల్లు పోయుట, ఆశాది వారిచే అమ్మవారి కథ చెప్పడం, గ్రామ ప్రజలు బోనాలు సమర్పించడం, రాత్రికి విద్యుత్ దీపాలంకరణ, చెక్కభజన, కోలాటాల మధ్య ఛాందినీ బండ్లు ఊరేగింపు జరుగనున్నాయి.

బాధితులకు నష్టపరిహారం అందించాలి

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సు పల్లె గ్రామంలో కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతిచెందగా బాధితులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత రైతులతో మాట్లాడారు. 13 గొర్రెలు మృత్యువాత పడగా దాదాపు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రమణ, నాగముని, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

17 మందికి కంటి ఆపరేషన్లు



రోగులను ఆపరేషన్లకు సిద్ధం చేస్తున్న వైద్యుడు సురేష్‌బాబు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం వైద్యులు 17మంది రోగులకు కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రిలో నిర్వహించిన వైద్యశిబిరానికి అన్నమయ్యతో పాటు సత్యసాయి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి సుమారు 50మంది కంటిరోగులు విచ్చేశారు. కంటి వైద్యుడు సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం 50 మందికి పైగా రోగులకు కంటిపరీక్షలు నిర్వహించింది. వీరిలో 17 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఆపరేషన్లు నిర్వహించారు. అనంతరం గతంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 35 మందికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ స్వరూప్‌గుప్తా, క్లబ్ మాజీ అధ్యక్షుడు చెన్నూరు అన్వర్‌బాషా, కంటివైద్యులు మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఎం.రాజగోపాల్‌రెడ్డితో పాటు ఆసుపత్రి సిబ్బంది, రోగుల సహాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పాల్గొన్న 1986-87 బ్యాచ్ విద్యార్థినులు

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986- 87 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పలువురు విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 37 సంవత్సరాల తరువాత వారు కలవడంతో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాసేపు సరదాగా గడిపారు. కార్యక్రమంలో శివనాగలక్ష్మి, క్రిష్ణవేణి, రమాకుమారి, బి. వెంకటసుబ్బమ్మ, చంద్రరజిని, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పందెం రాయుళ్ళు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో కోడిపందెం ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ షరీఫ్ ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో కోడిపందెం ఆడుతున్న స్థావరాలపై దాడులు నిర్వహించి, 18 మందితో పాటు 6 కోడిపుంజులు, రూ. 1820 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామ దేవతలకు పూజలు

కలకడ : తిరుపతి గంగమ్మ, బోయకొండమ్మకు శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల కోసం నూతన ఆలయాలు నిర్మించి, విగ్రహ ప్రతిష్ట కోసం 41 రోజులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పెద్దల పోరుకు సర్వం సిద్ధం

- పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు
- రాజంపేట, రైల్వేకోడూరులో 22 పోలింగ్ కేంద్రాలు
- ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



వీరబల్లి: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు



రాజంపేట: ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతున్న పీఓలు, ఏపీఓలు



చిన్నమండెం: బూత్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

రాజంపేట : రాజంపేట సబ్ కలెక్టరేట్ పరిధిలో పెద్దల పోరుకు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజంపేట నియోజకవర్గంలో రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో పట్టభద్రులు 8523, ఉపాధ్యాయులు 707లు ఉన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాల్లో పట్టభద్రులు 5,924, ఉపాధ్యాయులు 502 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం ఆయా మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. వీడియోగ్రాఫర్లు, పోలింగ్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన సబ్ కలెక్టర్

సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ ప్రక్రియను రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ఖాన్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూం, పీఓలకు బాధ్యతల అప్పగింత తదితర కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. నిబంధనల మేరకు ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేలా అన్ని చర్యలను చేపట్టాలని ఆదేశించారు. పోలీసు బందోబస్తుపై డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డితో ఆయన సమీక్షించారు.

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తును నిర్వహించేందుకు పోలీసుశాఖ సమాయత్తమైంది. డీఎస్పీ స్ట్రైకింగ్‌ఫోర్స్-1, సీఐ స్ట్రైకింగ్‌ఫోర్స్-3, ఎస్ఐ రూట్ మొబైల్స్-8, 4 చెక్‌పోస్టులు, 8 పికెటింగ్ టీంలు, స్టాటిక్ ఫోర్స్-200, స్పెషల్‌పార్టీ-1, ఫ్లైయింగ్ స్క్వాడ్-8, వీడియో స్లైకింగ్-8, మోడల్ కాండక్ట్ కోడ్ 8 బృందాలను రంగంలోకి దింపారు. ఐదు రూట్లలో బస్సులో ఎన్నికల సామగ్రిని పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. ఈ మేరకు డీఎస్పీ పోలీసులతో బందోబస్తు సమావేశం నిర్వహించి, ఎన్నికలకు సంబంధించి మార్గదర్శకాలను సూచించారు.

వీరబల్లి : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు సోమవారం నిర్వహించడంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఐ లింగప్ప, ఎస్ఐ రహిముల్లాలు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ బూత్‌లకు బందోబస్తుగా తీసుకువచ్చినట్లు తెలిపారు. క్యూ పాటించి ఓట్లు వేసేందుకు బూత్‌ల వద్ద భారీకేడ్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సోమవారం(నేడు) జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. చిన్నమండెం మండలవ్యాప్తంగా 34 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 680 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. పోలింగ్‌స్టేషన్‌లో పటిష్ఠమైన బందోస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

ఓబులవారిపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని పోలింగ్ బూత్‌లు వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాజంపేట డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పీర్ మున్నీ, ఎంపీడీఓ విజయారావులతో కలిసి పరిశీలించారు.



ఓబులవారిపల్లె: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ పీర్‌మున్నీ



పెనగలూరు: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్, అధికారులు

ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ వద్ద 144 సెక్షన్

పెనగలూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. ఎస్ఐ హేమాద్రి, పోలింగ్ పీఓలు కుమార్ బాబు, మోహన్ కృష్ణ, తహసీల్దార్ శ్రీధర్ రావులు ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఏజెంట్ ఫారాలపై ఎస్ఐ ముందుగానే పరిశీలించి వారి సంతకాలతో సహా ఏజెంట్ ఫారాలను తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ పరిశీలించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీసల్దార్ మురళీకృష్ణ, 0ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలియజేశారు. చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించిన 46, పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి 96 నెంబరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. 771 మంది పట్టభద్రులు, 48 మంది ఉపాధ్యాయులు ఓటర్లు ఉన్నారన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో ఉపాధ్యాయ ఓట్లు 43, గ్రాడ్యుయేట్ ఓట్లు 748 మంది సోమవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను సీఐ వరప్రసాద్ పరిశీలించారు.

శివలింగాన్ని స్పృశించిన సూర్యకిరణాలు



శివలింగాన్ని స్పృశిస్తున్న సూర్య కిరణాలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని పాత రాయచోటిలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలోని శివలింగాన్ని సూర్యకిరణాలు స్పృశించాయి. ప్రతి ఏడాది ఇదే నెలలో మార్చి 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు శివలింగాన్ని నేరుగా సూర్యకిరణాలు తాకినట్లు ఆలయ పూజారులు తెలిపారు. ఈ సందర్భంలో స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కారును ఢీ కొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

ములకలచెరువు : కర్ణాటక ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో నలుగురికి స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురంకు చెందిన వి.కొండా రెడ్డి తన స్నేహితులతో కలిసి తిరుపతికి బయల్దేరారు. ములకలచెరువు మండలం బురకాయలకోట సమీపంలోకి రాగానే బళ్లారికి వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినింది. కారులోని వి.కొండారెడ్డి(45), రామ్మోహన్(44), రామాంజులు(48), రామ్‌కుమార్(45)లకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘన జీవామృతంతో మామిడిలో చీడపీడల నివారణ



ఘన జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : ఘన జీవామృతంతో మామిడిలో చీడపీడల నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారిణి సరస్వతి పేర్కొన్నారు. ఆదివారం దప్పేపల్లి పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో 14 ఎకరాల మామిడి తోటకు ఘనజీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, జీవామృతం మామిడిలో చీడపీడలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మామిడిలో పూత, పిందె రాలకుండా కాయ వస్తుందని ఆమె తెలియజేశారు. రైతు సోమశేఖర్ రెడ్డి 14 ఎకరాలలో కషాయాలు ఉపయోగిస్తున్నారని ఆమె తెలిపారు. ఘనజీవామృతం 22 టన్నులు, ద్రవ జీవామృతం 15 వేల లీటర్లు తయారు చేసి మామిడి తోటలకు పిచికారీ చేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రతి రైతు తమకు అందుబాటులో ఉండే ఆకులు ద్వారా ప్రకృతి ఎరువులు తయారు చేసుకొని పొలాలకు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు అంజనమ్మ, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మలకాటిపల్లె గ్రామ సమీపంలోని వీరగంగమ్మ దేవస్థానం ఉత్సవాల సందర్భంగా ఆఖరి రోజున ఆదివారం వీరగంగమ్మ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీలు ఆద్యంతం రసవత్తరంగా జరిగాయి. బండలాగుడు పోటీలలో కడప జిల్లా బి. చెర్లోపల్లి చెందిన నంద్యాల శివరామ్ రెడ్డి సంబంధించిన కాడ్లు మొదటి స్థానం, అనంతపురం జిల్లా క్రిష్టాపురానికి చెందిన నాగరాజు, రామచంద్రారెడ్డి సంబంధించిన కాడ్లు ద్వితీయ స్థానం , అన్నమయ్య జిల్లా నందలూరుకి చెందిన షేక్ హబీబుల్లా కాడ్లు మూడవ స్థానం, నంద్యాల జిల్లా, పీఆర్ పల్లికి నాగయ్య ఎడ్ల కాడ్లు నాలుగవ స్థానం, చివరగా 5వ స్థానంలో కడప జిల్లా చద్దిపిరాళ్లకు చెందిన బాలరాజు సత్తెలోలు, చల్లాశివరెడ్డి ఎడ్లకాడ్లు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అంతకుముందు ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ శివారెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలందించాలి



దాతలను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో ప్రతి ఒక సభ్యుడు నిస్వార్థంగా సేవలందించాలని ఆ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమలలో లక్కిరెడ్డిపల్లె మానవత సంస్థ అధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, రాయచోటి నియోజకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల రద్దీ నెలకొంది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లోని కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు



బహుమతిని అందిస్తున్న సుబ్రమణ్యంరాజు

రాజంపేట టౌన్ : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.సుబ్రమణ్యంరాజు తెలిపారు. ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ఇటీవల ఉమ్మడి వైఎస్సార్ జిల్లాస్థాయిలో హిందీ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం స్థానిక ఎంఆర్సీ భవనంలో సుబ్రమణ్యంరాజు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇలాంటి పరీక్షలు విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు దోహదపడగలవని తెలిపారు. హిందీ ఉపాధ్యాయుడైన సర్తాజ్ హుస్సేన్ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తుండటం ఎంతైనా అభినందనీయమని తెలిపారు. టెన్త్ విద్యార్థులు ఇలాంటి పరీక్షలు ఎక్కడ నిర్వహించినా రాయాలని సూచించారు. పబ్లిక్ పరీక్షలకు అతితక్కువ సమయం ఉందని అందువల్ల విద్యార్థులు సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా బాగా చదివి మంచి గ్రేడింగ్ పాయింట్లతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కాగా ఈ ప్రతిభా పరీక్షలో ప్రథమ బహుమతి రూ.3వేలు ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.శ్రీదేవి, ద్వితీయ బహుమతి రూ.2వేలను అదే పాఠశాలకు చెందిన ఏ.ఆసీఫ్, తృతీయ బహుమతి వెయ్యి రూపాయిలను రాజంపేట మండలం ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లవి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు ముద్దా ఆదిశేషారెడ్డి, హరినాథ్, స్వామినాథన్, హిందీ ఉపాధ్యాయులు నాగభూషణం, చాంద్‌బాషా, ప్రసన్న, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతి పూజ
- విద్యార్థులకు పలు సూచనలు చేసిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

రాజంపేట టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ బండి చంద్రమోహన్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు ముగిసే వరకు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిలో తల్లిదండ్రులు, తోడ పుట్టిన వారి మధ్య చిన్నపాటి కొట్లాటలు వంటివి జరిగినా వాటిని అస్సలు పట్టించుకోవద్దన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి మనస్సును ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఎక్కువ సమయం మేల్కొని చదవకుండా వేకువజామున లేచి చదవాలన్నారు. రోజుకు ఎనిమిది గంటలకు తక్కువ కాకుండా నిద్రపోవాలని తెలిపారు. అప్పుడే మెదడు చురుకుగా పని చేస్తుందన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున నీరు, మజ్జిగను ఎక్కువగా తాగాలని తెలిపారు. విద్యార్థులు ఏడాది పాటు కష్టపడి చదివారని, ఆ కష్టానికి ప్రతిఫలం దక్కాలంటే మరో ఇరవై రోజుల పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. విద్యార్థులందరు పరీక్షలు బాగారాసి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. తొలుత అమ్మవారిశాల ఆలయ అర్చకులు పద్మనాభ సోమయాజుల నరసింహ కళాశాలలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు ఉంచి విశేషంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.నరసింహారెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, లక్ష్మీదేవి, జయమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం రాష్ట్ర ప్రజలకు వరం



రాజంపేట రూరల్: వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా, నాయకులు



రాయచోటి అర్బన్: వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న పార్టీనేతలు, ప్రజాప్రతినిధులు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో రాజన్న రాజ్యంను తిరిగి తీసుకొచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు వరాలజల్లు కురిపిస్తున్నారని ఎమ్మెల్యే మెడా మల్లికార్జునరెడ్డి కొనియాడారు. స్థానిక జాతీయ రహదారిపై ఉన్న మేడా నిలయంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే మేడా ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. మేడా నిలయం జగన్ నినాదాలతో హోరెత్తింది. వైస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మేడా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. తదనంతరం కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుండటంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సీఎంగా కలకాలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని కోరుకున్నారు. ఈ వేడుకలలో నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, పోలి సుబ్బారెడ్డి, ఎం.రవికుమార్, డి.చిదానందగౌడ్, పి.సుధాకర్, ఎస్.రామకృష్ణ, పి.విశ్వనాథరెడ్డి, డి.భాస్కర్‌రాజు, బి.రామ్మోహన్ నాయుడు, ఎం.సురేఖ, వి.రమణ, వి.గంగిరెడ్డి, కె.రఘునాథరెడ్డి, ఎస్.నవీన్‌కుమార్, బి.శేఖర్‌రాజు, డీలర్ బుజ్జిబాబు, బి.శివయ్య, ఏ.మధుబాబు, కె.చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు జి.గుల్జార్‌బాషా, పి.మసూద్‌అలీఖాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే వైఎస్ఆర్‌సీపీ ధ్యేయం

రాయచోటి అర్బన్ : ప్రజల సంక్షేమమే వైఎస్ఆర్‌సీపీ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీనేతలు, ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేయడంతో పాటు కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం వైఎస్ జగన్‌తో ప్రారంభమైన పార్టీ నేడు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులతో అతిపెద్ద పార్టీగా అవతరించినట్లు చెప్పారు. మహానేత వైఎస్ఆర్ ఆశయ సాధనే ధ్యేయంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు హబీబుల్లాఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వల్లపు రమేష్, రవిరాజు, విజయభాస్కర్, కొలిమి చాన్‌బాషా, ఆసిఫ్ అలీఖాన్, ఫయాజ్ అహమ్మద్, రిజ్వాన్, నరసింహారెడ్డి, ఈశ్వర్, జానం రవి, గౌస్‌ఖాన్, షబ్బీర్, అల్తాఫ్, రియాజ్, అన్నాసలీం, రియాజుర్ రహిమాన్, అజ్మతుల్లా, అయ్యవారురెడ్డి, ఆసిఫ్‌అలీఖాన్, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

పేదల పార్టీ వైఎస్సార్‌సీపీ

చిట్వేలి : 13 సంవత్సరాల క్రితం పేదల అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేసి పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా మాజీ సర్పంచ్ చొడవరం రఘురామిరెడ్డి ఎస్టేట్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్ రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, లింగం లక్ష్మీకర్, రమణారెడ్డి, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, మంద నాగేశ్వర, ఈశ్వరయ్య, పద్మాకర్, రాముడు, లోకేష్, కనకరాజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



లక్కిరెడ్డిపల్లి: దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



సంబేపల్లె: రామాలయానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

ఆలయాల నిర్మాణాల ద్వార ప్రజలు భక్తిభావం పెంపొందించుకోవాలని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ ఉదయకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ పోతువాండ్లపల్లె నూతనంగా నిర్మించనున్న రామాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలయాన్ని త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. ఆలయ నిర్మాణానికి ఆవసరమైన స్థలాన్ని దాతలు గంగిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ఇవ్వడం హర్షణీయమన్నారు.

కుర్నూతల గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ దర్శనానికి ఆదివారం వేలాది మంది భక్తులు వచ్చారు. దీంతో గంగమ్మ ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. క్యూ లైన్ ద్వారా ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీంద్రరాజులు దర్శన ఏర్పాట్లు చేశారు.